క్లుప్తంగా

రూ.50 వేల ఆర్థికసాయం



చెక్కును అందజేస్తున్న అనసూయదేవి

రణస్థలం: రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో అటెండర్‌గా పని చేస్తున్న బి.సునీల్‌కుమార్ కుమారుడు (మూడేళ్లు) అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్స చేయాల్సి ఉండటంతో దాతల సహాయాన్ని కోరుతున్నారు. పైడిభీమవరంలోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌రేటరీస్ సామాజిక కార్పొరేట్ బాధ్యతలో భాగంగా సీనియర్ డైరెక్టర్ కె.వి.ఎస్.ఎన్.రాజు ఆదేశాల ప్రకారం రూ.50 వేలు చెక్కును గురువారం అందజేశారు. ఈ చెక్కును సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర జాయింట్ కమిషనర్ అనసూయదేవి చేతుల మీదుగా విజయవాడలో అందించారు. డాక్టర్ రెడ్డీస్ లైజినింగ్ ఉద్యోగి గార ప్రసాద్ ఉన్నారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



సాయినాథునికి పూజలు చేస్తున్న భక్తులు

గార: మండల కేంద్రం గారలోని షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ధర్మకర్త కొన్న వెంకటేశ్వరరావు దంపతులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంకాల హారతులిచ్చారు. మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, శాలిహుండం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షులు మార్పు ధర్మారావు, పూడి బాలాదిత్య, అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



కళ్ల రక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ప్రముఖ వైద్యులు, లయన్ డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సత్య సాయి అన్నదాన ప్రాంగణ ఆవరణలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. నేత్రాల జాగ్రత్తపై అవగాహన కల్పించారు. క్లబ్ ప్రతినిధులు.. మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, డాక్టర్ పొన్నాడ శేషుబాబు, బాడాన దేవభూషణ్, సభ్యులు టెక్కం రాంగోపాల్, గుత్తు చిన్నారావు పాల్గొన్నారు.


సబ్సిడీపై వంటనూనె విక్రయం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వంట నూనె ధరలు పెరిగిన నేపథ్యంలో ప్యాకెట్‌పై రూ. 5 నుంచి 10 రూపాయల వరకు సబ్సిడీ ప్రజలకు విక్రయిస్తున్నట్టు డీఎస్‌వో సూర్యప్రకాస్‌రావు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీకాకుళం నగరంలోని రైతుబజారు, డీఎస్పీ కార్యాలయం వద్ద, ఎస్ఎస్ఆర్ మాల్ వద్ద గురువారం ఆయిల్ ప్యాక్లను విక్రయించారు. కార్యక్రమంలో టీడీ చక్రవర్తి, వీఆర్వో విశ్వేశ్వరరావు, రైతుబజారు సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయినాథునికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: బొందిలిపురంలోని సాయి దర్బార్‌లో గురువారం సందర్భంగా షిర్డీసాయి నాథునికి ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు సంతోష్ బ్రహ్మ, సురేష్ బ్రహ్మల ఆధ్వర్యంలో స్వామికి ఉదయం కాకాడ హారతి, వస్త్రాలంకరణసేవ, పుష్పాలంకరణ సేవ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే రెల్లవీధిలోని సాయిబాబా మహాసమాధి శతయాబ్ది మందిరంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. మందిరం అర్చకులు మావుడూరి రాఘవశర్మ ఆధ్వర్యంలో సత్సంగం నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్: ప్రజా సమస్యల పరిష్కరించడమే ప్రజాదర్బార్ ఉద్దేశమని స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పింఛన్, ఇల్లు ఇప్పించాలని, సాగు, తాగునీరు, ఇంటి బిల్లులు మంజూరు చేయాలని మండలానికి చెందిన పలువురు అర్జీలు పెట్టుకున్నారు. తహసీల్దార్ గణపతి, ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ పాల్గొన్నారు.

పచ్చదనం ఆవిరి!



80 అడుగుల రోడ్డులో ఎండిన చెట్లు

- ఎండిపోయిన చెట్లు
- పట్టించుకోని నగరపాలకసంస్థ అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరం పాలక సంస్థ పరిధిలో పచ్చదనం ఆవిరైందనే ఆందోళన జనం నుంచి వ్యక్తమవుతోంది. వర్షాకాలం అయినప్పటికీ వేసవిని తలపిస్తున్న ఎండతో జనం అల్లాడిపోతున్నారు. దీనికి కారణం మొక్కలు నాటకపోవడం....ఉన్నవి మోడువారినప్పటికీ పట్టించుకోకపోవడమేనని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. శ్రీకాకుళం నగరంలో రోడ్లకు ఇరువైపులా, సెంటరింగ్‌లో గతంలో అధికారులు వివిధ మొక్కలను నాటి సంరక్షించారు. అయితే ఇప్పుడు వాటిలో చాలా ఎండిపోవడం, మరికొన్ని వ్యాపార ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేయానికి నరికేయడం, చెట్ల కొమ్మలు అడ్డుతొలగించుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ పరిస్థితి శ్రీకాకుళం నగరంలో 80 అడుగుల రోడ్డులో చాలా చోట్ల కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల పూర్తిగా చెట్టు లేకుండా వాటి సంరక్షణ కోసం వేసిన సిమెంట్ కుండీలే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల పూర్తిగా చెట్లు కొమ్మలు కొట్టేస్తున్నారు. అనాధికారికంగా చెట్లను.. వాటి కొమ్మలను నరికడం నేరం. కానీ ఇక్కడ మాత్రం దీన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డులో నిరంతరం జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు రాకపోకలు సాగిస్తున్నా ఇవేమి



తమకు పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారి వాతావరణం వేడెక్కిపోతోంది. ఈ రోడ్డులోనే తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం, ఇదే రోడ్డులో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఇల్లు సైతం ఉంది. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.



సిమెంట్ కుండీలో నరికిన చెట్టు మొదలు



కొమ్మలు నరికేసి దర్శమిస్తున్న చెట్టు

కఠిన చర్యలు తీసుకుంటాం



80 అడుగుల రోడ్డులో చెట్లు, మొక్కలు పాడైన చోట కొత్తగా నాటేందుకు చర్యలు చేపడతాం. వ్యాపార వర్గాలవారు ఏవైనా వారి సొంత వ్యాపార ప్రకటనల బోర్డుల కోసం చెట్లు తీసేయడం వంటివి చేసినట్లు తమ దృష్టికొస్తే కఠిన చర్యలు చేపడతాం. ఇటీవల కేబుల్‌వైర్ల మరమ్మతుల కోసం కొన్నిచోట్ల కొమ్మలు కొట్టడం జరిగింది. ఇరువైపులా గ్రీనరీ అభివృద్ధికి చర్యలు చేపడతాం.

-పి.వి.వి.డి.ప్రసాద్, నగరపాలక సంస్థ కమిషనర్

వరుణుడి కరుణ కోసం..



ముద్దాడ సమీపంలో నీరులేక ఎండిన వరి పంట



ధర్మవరం సమీపంలో ఎండిన వరి పొలం

ఎచ్చెర్ల క్యాంపస్: ఖరీఫ్ వరి సాగుకు ఇంతవరకు విత్తనాలు, దుక్కులు, ఎరువులు, కూలీల ఖర్చులు ఎకరాకు రూ.20 వేలకు పైగానే ఖర్చు చేశారు. నారాయణపురం కుడి కాలువ కింద వరి పంట ఎండుతోంది. వర్షాలు అనుకూలిస్తే తప్ప పంటలు పండే పరిస్థితి లేదు. వర్షం లేకపోతే 10 రోజుల్లో పంటలు పూర్తిగా ఎండిపోతాయి. 5,000 ఎకరాల్లో వరి పంట ఎండిపోయే పరిస్థితి ఉంది. వర్షం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. కాలువలో చుక్క నీరు రావటం లేదు. కూటమి ప్రభుత్వానికి ముందస్తు కార్యాచరణ లేకపోవటం రైతుల పాలిట శాపంగా మారింది.



పెయ్యిలవానిపేట సమీపంలో సాగునీటి కాలువ దుస్థితి



నవభారత్ సమీపంలోని కాలువలో పేరుకుపోన గుర్రపుడెక్క



ఎచ్చెర్ల క్యాంపస్: చిన్నకొంగరాంలో దుర్గాదేవికి కుంకుమార్చనలు నిర్వహిస్తున్న భక్తులు

దుర్గమ్మా.. కరుణించమ్మా..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకుంటున్నాయి. దీంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఎనిమిదో రోజైన గురువారం వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి దుర్గాదేవీ కారుణించమ్మా అని మొక్కులు చెల్లించుకున్నారు. భజనలు, అన్నప్రసాద వితరణలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

-సాక్షి నెట్‌వర్క్



గార: దుర్గాదేవిగా దర్శనమిస్తున్న గార దుర్గాంబ



శ్రీకాకుళం కల్చరల్:బలగ బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో సామూహిక కుంకుమ పూజలలో మహిళలు



శ్రీకాకుళం కల్చరల్:పెద్దబరాటం వీధిలోని నీలమ్మతల్లికిగులాబీలతో అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్:హౌసింగ్ బోర్డు కాలనీలోని చిన్మయమిషన్‌లో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గామాత



శ్రీకాకుళం కల్చరల్:నక్క వీధిలోని ఉమాదేవిని దుర్గాదేవిగా భావించి సహస్ర నిమ్మకాయలతో అర్చనలు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటివీధిలో దుర్గామాతగా లలితాదేవి



శ్రీకాకుళం కల్చరల్:కాకివీధిలో ముత్యాలమ్మతల్లికి మిఠాయిల నైవేద్యం

అమృత ఆహారం పంపిణీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు అమృత ఆహారాన్ని (పౌష్టిక ఆహారం) శ్రీసత్య సాయి సేవా సంస్థల ప్రతినిధులు గురువారం అందజేశారు. ప్రతి నెల గర్భిణులకు పౌష్టి కాహారం అందజేస్తున్నట్లు తెలిపారు. సత్యసాయి సేవా సంస్థల జోనల్ కన్వీనర్ శివనారాయణ, వైద్యాధికారి మాడు గుల ఉషశ్రీ, సంస్థ ప్రతినిధులు రామారావు, నూక రాజు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు అందజేసిన అమృత ఆహారం

పాత్రునివలస విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం రూరల్: పాత్రునివలసలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు నరేంద్రకుమార్, సాయిశ్రీనివాస్, గిరిధర్, కార్తిక్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తా చాటారు. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇటీవల రాజమండ్రిలో జరిగిన అండర్-17 హ్యాండ్ బాల్ విభాగంలో తమ పాఠశాల ద్వితీయ స్థానంలో నిలిందన్నారు. కోచ్‌గా వ్యాయామ ఉపాధ్యాయులు సతీష్‌నాయుడు వ్యవహరించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

12న శ్రీరాములు శత జయంతోత్సవం



బూర శ్యామసుందర్ (ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుడివీధికి చెందిన శివ తాలింఖానా వ్యవస్థాపకులు బూర శ్రీరాములు శతజయంతి ఉత్సవాలు స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు వారి కుమారులు శ్యామసుందర్, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, శంకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శివ తాలింఖానా ద్వారా సాహస క్రీడా రంగంలో ఎంతో మంది శిష్యులను తయారు చేసి కర్రసాము, కత్తిసాము నేర్పించారని, దాని ద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కూడా లభించాయని తెలిపారు. విజయదశమి రోజున సారంగడోల వీధిలోని రామమమదిరం వద్ద శ్రీరాలులు విగ్రహాన్ని పునః ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎం హెచ్ స్కూల్ గ్రౌండ్‌లో కర్రసాము విన్యాసాలు జరుగుతాయన్నారు.

జంగిల్ క్లియరెన్స్



వర్సిటీ ముందు శుభ్రం చేసిన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రహరీకి అనుకుని పొదలు ఆవరించాయి. సాక్షిలో గురువారం కథనం రావటంతో అధికారులు స్పందించారు. మొక్కలను తొలగించారు.

పుస్తకాల పంపిణీ

ఎచ్చెర్ల: ప్రతీ విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదువుకోవాలని పోస్ట్ మాస్టర్ లక్ష్మి అన్నారు. గురువారం లావేరు శాఖా గ్రంథాలయంలో ఆమె మాట్లాడారు. గ్రంథాలయంలో చదువుకుని ఉపాధ్యాయ పోస్ట్ సంపాదించిన ఎం.భాస్కర్‌రావు రిఫరెన్స్ పుస్తకాలు, కాంపిటేటివ్ పుస్తకాలు, గ్రూప్-2 మోడల్ పేపర్స్, సైన్స్‌అండ్ టిక్నాలజీ భారత దేశ చరిత్ర, సంస్కృతి వంటి పుస్తకాలను పంపిణీ చేశారు.

మహాలక్ష్మికి 136 పిండివంటల నైవేద్యం

అరసవల్లిలోని ఆదిత్యా నగర్‌కాలనీలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సరస్వతీ మాతకు 136 రకాల పిండి వంటలతో గురువారం రాత్రి నైవేద్యం సమర్పించారు. అలాగే సరస్వతీదేవికి కట్టిన పట్టు చీరను వేలం వేయగా డోల సత్యన్నారాయణ రూ.36 వేలకు దక్కించుకున్నారు.

-శ్రీకాకుళం కల్చరల్



ఆరోగ్య కేంద్రం ప్రారంభం

రణస్థలం: మండలం కేంద్రంలో ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామీణ ఆరోగ్య కేంద్రాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు గురువారం ప్రారంభించారు. సర్పంచ్ పిన్నింటి భానోజీనాయుడు సొంత ఖర్చులతో నిర్మించిన బృంధావన్ గార్డెన్, బస్ షెల్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన మోదీతోనే సాధ్యం

శ్రీకాకుళం అర్బన్: అవినీతి రహిత పాలన ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు అన్నారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మోదీ వంద రోజుల పాలనపై కరపత్రాలు, బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. అయుష్మాన్ భారత్ ఆరోగ్య రక్ష పథకంలో 70 ఏళ్లు దాటిన వృద్ధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించే సౌకర్యం కల్పించిన మోదీకి జీవితాంతం రుణపడి ఉంటామని వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు అంటున్నారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్, ఎం.కృష్ణారావు, జి.వి.అప్పలనాయుడు, గేదెల లక్ష్మి, వాసంతి, రమ్య, ఎం.మల్లిబాబు ఉన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాల్లో నీరజా శిష్య బృందం ప్రదర్శన

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన వేడుకలలో భాగంగా నృత్య రూపక ప్రదర్శన చేసినట్లు పట్టణానికి చెందిన అభినయ నృత్యనికేతన్ నృత్య దర్శకురాలు నీరజ సుబ్రహ్మణ్యం తెలిపారు. వేంకటేశ్వర వైభవంపై గురువారం ఇచ్చిన ప్రదర్శన అందరినీ అలరించిందన్నారు.



బ్రహ్మోత్సవాలలో నీరజా శిష్య బృందం

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని రామాంజనేయ థియేటర్ సమీపంలో సర్వీస్ రోడ్డు దాటుతున్న స్థానిక మహిళ పద్మావతిని ఓ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. బలమైన గాయాలు కావడంతో వెంటనే శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈమె పొందూరు తహశీల్దార్ కార్యాలయంలో సబార్డినేటర్ పనిచేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా ముందుకుసాగాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ, ఎస్టీలంతా ఐక్యంగా ఉంటూ ముందుకు సాగాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. నగరంలోని ఇలిసిపురం అంబేడ్కర్ భవనంలో పోతల దుర్గారావు అధ్యక్షతన శ్రీకాకుళం జిల్లా దళిత, ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల అభినందన సభ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

శ్రీకాకుళం

9912220343

Office mail : sklmadvt@gmail.com